

రూ.1,00,116 విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల క్షేత్రంలో శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు తల్లాప్రగడ వెంకట్రాజు దంపతులు (హైదరాబాద్) సోమవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.




దేవళాలకు పెళ్లి కళ!

8లో

పిఠాపురం, సామర్లకోట, పలివెల పుణ్యక్షేత్రాలు కల్యాణ కాంతులతో మెరిసిపోయాయి. ఆయా ఆలయాల్లో శివయ్య కల్యాణోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు.

డెల్టాలకు 8,200 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 8,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కుల చొప్పన వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.25 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

వ్యభిచార గృహంపై దాడి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం సావరం బైపాస్ రోడ్డులో ఓ డాబా ఇంట్లో వ్యభిచారం జరుగుతున్న సమాచారంతో పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి ఆకస్మిక దాడి నిర్వహించారు. అమలాపురం రూరల్ మండలం పేరూరు శివారు విశ్వేశ్వర అగ్రహారానికి చెందిన ఓ మహిళను, అదే మండలం పేరూరు గ్రామానికి చెందిన చింతపల్లి సోమశేఖర్, ముమ్మిడివరం మండలం కొత్తలంక గ్రామానికి చెందిన కటారి శివకృష్ణలను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. వీరి నుంచి ఒక ఆటో, ఒక మోటారు సైకిల్, రూ.1,300 నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అరెస్ట్ చేసిన ముగ్గురి నిందితులను అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టు ముందు హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో సీఐతోపాటు పట్టణ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బిల్డింగ్ పైనుంచి దూకేసిన విద్యార్థిని

మండపేట: ఆరో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని స్కూల్ బిల్డింగ్ పైనుంచి దూకేసింది. దీంతో విద్యార్థినికి గాయాలు కావడంతో ఉపాధ్యాయులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే బయటకు పొక్కనివ్వకుండా ఉపాధ్యాయులు జరిగిన సంఘటనను దాచి పెట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ విద్యార్థిని పోలీస్ స్టేషన్ వీధిలో వున్న బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. రోజు వెళ్లినట్టుగానే సోమవారం ఆ విద్యార్థిని పాఠశాలకు హాజరు అయింది. ఇంటర్వెల్ సమయంలో తోటి విద్యార్థులతో మాట్లాడుతుండగానే హఠాత్తుగా ఫస్ట్‌ఫ్లోర్ నుంచి కిందికి దూకేసింది. దీంతో ముక్కుకు చేతులకు గాయాలవడంతో వెంటనే ఉపాధ్యాయులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి, ముక్కుకు తగిలిన గాయం పెద్దది కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి సిఫారసు చేశారు. అయితే ఆ విద్యార్థినిని ఎందుకు దూకేశావని ఆరా తీయగా తండ్రి తనను సైకిల్‌పై బడికి పంపడం లేదని కోపం వచ్చి దూకేశానని చెప్పింది. రోజులు బాగోలేదని తండ్రే స్వయంగా రోజూ సైకిల్‌పై ఎక్కించుకుని స్కూల్‌కు తీసుకువెళ్తాడని, ఈ నేపథ్యంలో విద్యార్థిని అలా కుదరదు తాను ఒంటరిగా సైకిల్ వేసుకుని వెళ్తానని చెప్పడంతో కూతురు మాట వినడం లేదని సోమవారం ఉదయం పాఠశాలలోని ఉపాధ్యాయులకు చెప్పారు. తండ్రి తనపై ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశాడన్న కోపంతో ఆటవిడుపు సమయంలో భవనం నుంచి దూకేసింది.

రత్నగిరికి భక్తుల తాకిడి

అన్నవరం: వేలాదిగా వచ్చిన భక్తులతో రత్నగిరి సోమవారం కిటకిటలాడింది. మాఘ బహుళ ఏకాదశి సందర్భంగా ఉదయం నుంచీ సత్యదేవుని దర్శనానికి భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ కిక్కిరిసిపోయాయి. భక్తులు వందలాదిగా వాహనాల్లో రావడంతో పార్కింగ్ స్థలాలన్నీ నిండిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వ్రతాలు 2,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సత్యదేవుని అన్న ప్రసాదాన్ని 5 వేల మంది భక్తులు స్వీకరించారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్యదేవునికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వర్ణ పుష్పార్చన, ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ పుష్పార్చన జరిగాయి.

ఆక్వా రైతులపై
అదనపు లోడు

- అదనపు లోడు వినియోగిస్తే వాతలే
- అదనపు బిల్లు.. దానిపై అపరాధ రుసుము... ఆపై డిపాజిట్ చార్జీలు
- విద్యుత్ కనెక్షన్‌కు వచ్చి రూ.10 వేల నుంచి రూ.70 వేలు
- ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని పట్టు
- రూ. ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షల వరకు భారం

సాక్షి, అమలాపురం: దేశీయంగా.. అంతర్జాతీయంగా ఎగుమతులు పెరగడంతో ధరలు పెరిగి కోలుకుంటున్న ఆక్వా ఊపిరి తీసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. వివిధ రకాలుగా విద్యుత్ చార్జీల మోత మోగిస్తూ ఆక్వా రైతులను ముప్పుతిప్పలు పెడుతోంది. అదనపులోడు వినియోగం బిల్లు.. దానిపై అపరాధ రుసుము.. ఆపై అదనపు వినియోగానికి డిపాజిట్.. ఇవి కాదని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు.. సర్వీస్ లైన్ చార్జీల పేరుతో ఆక్వా రైతుల నడ్డివిరుస్తోంది.

సర్వీసు లైన్ చార్జీల మోతపై రైతుల ధర్నా

జిల్లాలో వెనామీ సాగుకు విద్యుత్ శాఖ యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీపై విద్యుత్ అందిస్తోంది. జిల్లాలో 5,970 వరకు ఆక్వా సర్వీసులు ఉండగా, వీటిలో 4,870 రాయితీ సర్వీసులున్నాయి. ఇటీవల రొయ్యల ధరలు పెరగడంతో రైతులు ఈ ఏడాది తొలి పంటను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. ఈ సమయంలో విద్యుత్ శాఖ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రైతులకు నిద్ర లేకుండా చేస్తోంది. ఇటీవల ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లిలో ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ నిలిపివేయడంతో చెరువులోని రూప్ చందువాలు చనిపోయి రైతులు రూ.లక్షల్లో నష్టపోయిన విషయం తెలిసింది. అలాగే సర్వీసు లైన్ చార్జీల మోత మోగిస్తున్నారని సఖినేటిపల్లి మండలానికి చెందిన రైతులు ఇటీవల రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. రైతుల నుంచి ప్రతిఘటన అధికంగా ఉండడంతో విద్యుత్ సరఫరా తొలగింపు తాత్కాలికంగా నిలుపుదల చేసినా, వెనామీ రైతుల నెత్తిన విద్యుత్ చార్జీల కత్తి వేలాడుతూనే ఉంది.

బిల్లులో చూపించరు.. నోటీసు ఇవ్వరు

అదనపు విద్యుత్ వినియోగంపై రైతులకు సమాచారం ఉండడం లేదు. మీ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, మీ విద్యుత్ బిల్లు చెల్లింపునకు ఫలానా తేదీ ఆఖరు అని సెల్ ఫోన్లకు సంక్షిప్త సమాచారం పంపిస్తున్న విద్యుత్ శాఖ మీరు పరిధికి మించి విద్యుత్ వినియోగం చేస్తున్నారనే సమచారం ఇవ్వడం లేదు. కనీసం నెలనెలా వచ్చే బిల్లులో కూడా ఓవరు లోడు ఇంత బకాయి ఉందని కాని, అడిషినల్ కంజప్షన్ డిపాజిట్ (ఏసీడీ) ఇంత చెల్లించాలని కాని చూపించడం లేదు. వీటిపై విడిగా నోటీసు కూడా రైతులకు జారీ చేయడం లేదు. ఒక రాత్రికి రాత్రి స్పెషల్ డ్రైవ్ అని వచ్చి విద్యుత్ సర్వీసలు కట్ చేసుకుపోతున్నారు. ఏసీడీ, ఓవర్ లోడు చార్జీలు చాలామందికి రూ.50 వేలకు పైబడి ఉంటోంది. ఒకేసారి ఇంత పెద్ద మొత్తం చెల్లించడం చిన్న రైతులకు ఇబ్బందిగా మారింది. విచిత్రంగా ఏసీడీ చార్జీల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి. కానీ వేళ్ల మీద లెక్క పెట్టే స్థాయిలోనే రైతులు మాత్రమే ఆన్‌లైన్‌లో చూస్తుంటారు. పైగా దీనిలో ఓవర్ లోడు చార్జీలు కనిపించవు. ఈ రెండు పక్కాగా తెలుసుకోవాలంటే అమలాపురంలో ఉన్న విద్యుత్ శాఖ ఎకౌంట్స్ కార్యాలయానికి వెళ్లాల్సిందే.



వెనామీ రొయ్యల చెరువుల్లో ఏరియేటర్లు

అదనంగా వినియోగిస్తే వాతే

విద్యుత్ సర్వీస్ పొందిన సమయంలో పొందుతున్న హార్స్ పవర్ కన్నా అదనంగా వినియోగిస్తే రైతుకు బిల్లు మోత మోగుతోంది. అదనపు వినియోగం, దానిపై అసరాధ రుసుం కలిపి సర్వీసుకు రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు విద్యుత్ బిల్లు వస్తోంది. సాధారణంగా చిన్న రైతులు 25 కేవీ, 40 కేవీలు ట్రాన్స్‌ఫార్మర్లను వేయించుకుంటారు. వీళ్లు సాధారణంగా 15 నుంచి 20 కేవీ వరకు వినియోగిస్తుంటారు. చెరువులో రొయ్య పిల్లలు అధికంగా ఉండి కౌంట్ పెరిగిన తరువాత ఏరియేటర్లు ఎక్కువ సమయం వాడుతుంటారు. ఈ సమయంలో విద్యుత్ వాడకం ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ కన్నా అదనంగా ఉంటోంది.

దీనిని బూచిగా చూపి ఓవర్ లోడు చార్జీలు, దీనిపై అపరాధ రుసుము వసూలు చేస్తున్నారు. ఇది సర్వీసుకు వచ్చి రూ.10 వేల నుంచి రూ.70 వేల వరకు ఉంటోంది. జిల్లాలో సుమారు 400 మంది సర్వీసులపై అదనపు లోడు కత్తి వేలాడుతోందని అంచనా.

ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల భారం

ఆక్వా విద్యుత్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 5,450 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఆక్వా రైతులకు 25 కేవీ, 40 కేవీ, 62 కేవీ, 100 కేవీ, 150 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అదనంగా వాడుతున్నందున 25 కేవీ ఉన్న రైతులు 40 కేవీ, 40 కేవీ రైతులు 60 కేవీ కెపాసిటీ పెంచాలని ఒత్తిడి చేస్తున్నారు. 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేయించాలంటే రైతులు రూ.5 లక్షల నుంచి రూ.ఏడు లక్షల వరకు ఖర్చు కానుంది. ‘కేవలం నెల రోజులు మాత్రమే అదనంగా వాడితే దానిని మాత్రమే పరిగణలోకి తీసుకుని ఇన్ని రకాలుగా ఇబ్బంది పెట్టడం భావ్యంగా లేదు. కనీసం మూడు నెలల విద్యుత్ సగటు వినియోగాన్ని పరిగణలోకి తీసుకోవాలి’ అని ఆక్వా రైతులు కోరుతున్నా పట్టించుకునే వారు లేరు. ట్రాన్స్‌ఫార్మర్ల ఒత్తిడి వెనుక కాంట్రాక్టర్లతో విద్యుత్ శాఖ సాధారణ ఉద్యోగి నుంచి ఉన్నత స్థాయి ఉద్యోగుల వరకు లాలూచీ పడడం కూడా కారణమని ఆక్వా రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

అడిషనల్ లోడ్‌కు అదనపు చార్జీలు



ఆక్వా చెరువులకు వాడుకుంటున్న కరెంట్‌కు ఏడాదికి ఒకసారి కట్టే అడిషనల్ లోడ్ చార్జీలు పెనుభారంగా ఉన్నాయి. నాకున్న నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లకుగాను సర్వీస్ నంబర్ 2670కి 2023 మే 31వ తేదీ నుంచి రూ.63,118, సర్వీస్ నెం.2619కి 2018 అక్టోబర్ 9వ తేదీ నుంచి రూ.17,300 కట్టాలని తాఖీదులు ఇచ్చారు. బిల్లు కంటే ముందు అడిషనల్ లోడ్ కట్టకపోతే సర్వీసును డిస్ కనెక్ట్ చేస్తామంటున్నారు. బిల్లులు కట్టలేని పరిస్థితులో ఆక్వా రైతులు ఉన్నారు. దీనిపై అధికారులు పునరాలోచన చేయాలి.

– వీరా మల్లికార్జునరావు (మల్లిబాబు), ఆక్వా రైతు, సఖినేటిపల్లి

ట్రాన్మఫార్మర్లు మార్చడం రూ.లక్షలతో వ్యవహారం



కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వేసుకోమని ఇబ్బంది పెడుతున్నారు. కొత్తవి కొనాలంటే రూ.లక్షలతో వ్యవహారం. ఇంత సొమ్ములు మాకెక్కడ ఉన్నాయి. రూ.ఆరు లక్షల నుంచి రూ.9 లక్షల వరకు కట్టాలంటే మాటలు కాదు. నోటీసులు కూడా ఇవ్వకుండా సర్వీస్ నిలిపివేయడం వల్ల మా చెరువులలో చేపలు దెబ్బతింటున్నాయి.

– దుర్గారావు, ఆక్వా రైతు, ఎస్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం మండలం

ఎస్‌ఎల్‌సీ చార్జీలతో నష్టం



ఎస్ఎల్‌సీ చార్జీలతో ఆక్వా రైతులు చాలా నష్టపోతున్నారు. విద్యుత్ శాఖ ఆక్వా విద్యుత్ చార్జీల విషయంలో పాత విధానాన్నే అమలు చేయాలి. ఈ విషయంలో విద్యుత్ శాఖ ఆక్వా రైతులకు సహకరించాలి. చార్జీలు వసూళ్లకు రైతులపై ఒత్తిడి తేవడం దారుణం.

– ఒడుగు దుర్గారావు, ఆక్వా రైతు, గొంది, సఖినేటిపల్లి మండలం

అదనపు చార్జీలు వసూలు చేయొద్దు

గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులకు జేసీ ఆదేశం

అమలాపురం రూరల్: మార్చి ఒకటో తేదీ నుంచి గ్యాస్ డోర్ డెలివరీలో అదనపు చార్జీలు వసూళ్లు నిలిపివేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులను, డోర్ డెలివరీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లాలో 31 ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, డెలివరీ సిబ్బందితో గోదావరి భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మేలు చేకూర్చాలనే ప్రధాన సంకల్పంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా దీపం- 2 పథకాన్ని ప్రవేశపెట్టిందని ఇటీవల కాలంలో కోనసీమ జిల్లా ఎల్పీజీ గ్యాస్ వినియోగదారుల నుంచి అదనపు డోర్ డెలివరీ చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. జిల్లా నుంచి 70 శాతం మంది నుంచి ఫిర్యాదులు ఐవీఆర్ఎస్, వాట్సాప్ క్యూఆర్ కోడ్, ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా వచ్చాయని తెలిపారు. రశీదులో ముద్రించిన సొమ్మును మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. డోర్ డెలివరీలో అధిక చార్జీలు వసూళ్లపై క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అదనపు సొమ్ము వసూలు చేస్తే టోల్ ఫ్రీ 1967కి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల పాటించని పక్షంలో సంబంధిత గ్యాస్ డెలివరీ బాయ్స్, పంపిణీదారులపై చర్యలు తీసుకొంటామని తెలిపారు. తూనికలు కొలతల శాఖ కంట్రోలర్ రాజేష్ మాట్లాడుతూ డోర్ డెలివరీ వద్ద సిలిండర్ల తూనికను సీళ్లను పర్యవేక్షిస్తామని కేవలం 150 గ్రాముల వరకు వ్యత్యాసాలను అనుమతిస్తామని ఆపై వ్యత్యాసాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం.బాలసరస్వతి మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారులు, వారికిచ్చిన రశీదులో ముద్రించి ఉన్న ధర కంటే అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.



ఎల్పీజీ ఏజెన్సీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

ఉన్నత విద్యకు 10వ తరగతి తొలి మెట్టు

విద్యార్థుల బంగారు భవితకు ప్రాథమిక విద్యా పునాది అని, ఉన్నత విద్యకు 10వ తరగతి తొలి మెట్టని జేసీ నిషాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ నిర్ణయించే పదో తరగతి పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థులను సన్నద్ధం చేయడంతో పాటు వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి నూరు శాతం ఫలితాలు సాధిం చేందుకు కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రస్తుతం నేర్చుకున్న విషయాలు ఇప్పటి పరీక్షలకే కాకుండా జీవితాంతం ఉపయోగపడతాయని సూచించారు. పరీక్షలకు సుమారు 15 రోజులు వ్యవధి మాత్రమే ఉందని ఈ సమయం ఎంతో కీలక మైనదన్నారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి బోధించి పరీక్షలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేయాలన్నారు.

జిల్లాలో 95 పోలింగ్ కేంద్రాలు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ కోసం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 95 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని జేసీ తెలిపారు. కోనసీమలోని 22 మండలాల్లో 64,471 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారిలో పురుషులు 37,114 మంది, మహిళా ఓటర్లు 27,355 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారన్నారు. ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలవరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మార్చి 3వ తేదీన కౌంటింగ్ జరుగుతుందన్నారు.

ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్ల పరిశీలన

ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల శాసనమండలి పట్టభద్రుల పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సోమవారం కలెక్టరేట్‌లో పరిశీలించారు. బ్యాలెట్ సీరియల్ నంబర్లు పరిశీలించాలని, ప్రింటింగ్ తప్పులు, పేపరు బాగున్నదీ, లేనిదీ, నలిగిపోయిందీ పరిశీలించి బ్యాలెట్ పేపర్ తొలగింపు వంటి అంశాలపై అధికారులతో జాయింట్ కలెక్టర్ చర్చించారు. జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఏవో కాశీ విశ్వేశ్వరరావు, తహసీల్దార్లు అశోక్‌కుమార్, ఐపీ శెట్టి, ప్రసాద్, సుబ్రహ్మణ్యచారి పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నకు రూ.1.34 కోట్ల ఆదాయం

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల ద్వారా రూ 1,34,01,911 ఆదాయం వచ్చినట్టు దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. 31 రోజుల అనంతరం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సోమవారం హుండీలను తెరిచి నగదు, మొక్కుబడులను లెక్కించారు. ప్రధాన హుండీల నుంచి రూ.1,09,68,428, అన్న ప్రసాదం హుండీల ద్వారా రూ.21,50,593 సమకూరిందన్నారు. బంగారం 30 గ్రాములు, వెండి 1 కేజీ, విదేశీ కరెన్సీ నోట్లు 34 వచ్చినట్లు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. ఆలయ క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీల ద్వారా రూ.2,82,890 ఆదాయం లభించిందన్నారు. దేవదాయ శాఖ రాజమహేంద్రవరం ఇన్‌స్పెక్టర్ టీవీఎస్ఆర్ ప్రసాద్, పి.గన్నవరం గ్రూపు దేవాలయాల గ్రేడ్ -1 ఈఓ ఎన్‌వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు పర్యవేక్షణలో దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఉప సర్పంచ్ పోచిరాజు బాబూరావు, ముదునూరి వెంకటరాజు సమక్షంలో దేవస్థానం సిబ్బంది, అర్చకులు, గ్రామస్తులు, శ్రీవారి సేవకులు హుండీల నగదు, మొక్కుబడులు లెక్కించారు.

ప్రజాస్వామ్యంతో క్రూర పరిహాసం

- తుని మున్సిపాలిటీలో పరాకాష్టకు చేరిన టీడీపీ కుట్రలు
- బెదిరింపులు, కిడ్నాపులతో కౌన్సిలర్లను లొంగదీసుకునే యత్నం
- మహిళా కౌన్సిలర్లకు వేధింపులు
- మనస్తాపంతో చైర్‌పర్సన్ పదవికి సుధారాణి రాజీనామా
- కన్నీటి పర్యంతమైన కౌన్సిలర్లు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: తుని మున్సిపాలిటీలో కూటమి నేతల వేధింపులు, బెదిరింపులు, కిడ్నాపుల పర్వం పరాకాష్టకు చేరింది. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన వైస్ చైర్మన్-2 ఎన్నిక సందర్భంగా అధికార మదంతో రౌడీయిజం చేస్తూండటం.. రెవెన్యూ, పోలీసు అధికారులు తమ కనుసన్నల్లోనే పని చేసేలా ఒత్తిళ్లు తేవడం ద్వారా మున్సిపాలిటీలో అధికార మార్పిడి కుట్రకు టీడీపీ నేతలు పన్నాగం పన్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను బెదిరించి తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పోలీసు బలాన్ని కూడా ప్రయోగిస్తున్నారు. వరుసగా నాలుగు సార్లు వైస్‌చైర్మన్ ఎన్నికను గూండాగిరీతో అడ్డుకుంటూ.. ప్రజాస్వామ్యానికి పాతర వేసేలా టీడీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరు, వరుస పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురైన తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకట్రావుకు రాజీనామా పత్రం సమర్పించారు. ఇకపై సాధారణ కౌన్సిలర్‌గా మాత్రమే కొనసాగుతానని స్పష్టం చేశారు. సహచర కౌన్సిలర్లపై జరుగుతున్న దమనకాండను, చిత్రహింసలను చూడలేకే కలత చెంది చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందంటూ ఆమె మీడియా ముఖంగా కన్నీటిపర్యంతమయ్యారు. మహిళల కంటతడి పెట్టించిన టీడీపీ నాయకులకు రానున్న కాలంలో తగిన గుణపాఠం తప్పదని గద్గద స్వరంతో హెచ్చరించారు.

అధికార మదం.. మూకబలంతో ఆగడాలు

అధికార మదం, గూండాగిరీతో తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను నాలుగుసార్లు వాయిదా వేయించిన కూటమి నేతలు మరోసారి ఏం చేస్తారనేది అంతుపట్టనిదిగా ఉంది. సంఖ్యాబలం లేనప్పటికీ మూకబలంతో కౌన్సిల్‌లో ఆధిపత్యం చేజిక్కించుకునేందుకు టీడీపీ నేతలు అనేక ఆగడాలకు పాల్పడుతున్నారు. బెదిరింపులు, ప్రలోభాలతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కొంత మందిని బలవంతంగా తమవైపు తిప్పుకుంటున్నారు. మహిళా కౌన్సిలర్లు సైతం ‘పచ్చ’ గూండాల వేధింపుల నుంచి తప్పించుకోలేకపోతున్నారు. పోలీసులు, టీడీపీ నేతలు రేయింబవళ్లు ఇబ్బందులకు గురి చేస్తూ పార్టీ మారాలంటూ తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారని పలువురు కౌన్సిలర్లు బాహాటంగానే చెబుతున్నారు. సోమవారం నాటి మీడియా సమావేశంలో చైర్‌పర్సన్‌తో పాటు మరో మహిళా కౌన్సిలర్ వారాధి జ్యోతి కూడా ఇదే విషయాన్ని కుండ బద్దలుగొట్టారు. ఇలా టీడీపీ నేతల అప్రజాస్వామిక వైఖరితో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు విసుగెత్తిపోయారు. తమ పదవులను సైతం తృణప్రాయంగా వదులుకునేందుకు సిద్ధమవుతున్నారు.

అధికార యంత్రాంగం విఫలం

వైఎస్సార్ సీపీ పట్ల విధేయత, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా నాయకత్వ పటిమపై విశ్వాసంతో తుని మున్సిపాలిటీలో 28 మంది కౌన్సిలర్లూ ఇటీవలి వరకూ ఒకే మాట ఒకే బాటగా ఉన్నారు. వారిలో 12 మందిని కూటమి నేతలు బెదిరించి, ప్రలోభపెట్టి తమ గూటిలో చేర్చుకున్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన 8, 9 వార్డు కౌన్సిలర్లను మాట్లాడే పని ఉందంటూ రెండు రోజుల క్రితం పిలిచారు. 48 గంటలు కూడా గడవకుండానే మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారిద్దరూ కనిపించకపోవడం గమనార్హం. వైస్ చైర్మన్ ఎన్నిక మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకూ జరిగిన పరిణామాలు ప్రజాస్వామ్య, అధికార యంత్రాంగం వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల అధికారులు ఎన్నికల తేదీ ప్రకటించడం, ఎన్నిక జరగాల్సిన సమయానికి టీడీపీ నాయకులు తుని కౌన్సిల్ హాలు వద్ద రౌడీలు, అసాంఘిక శక్తులతో మోహరించి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను బెదిరించడం, చివరకు ఎన్నిక వాయిదా వేయడం పరిపాటిగా మారింది. జిల్లా స్థాయి రెవెన్యూ, పోలీసు అధికారులే స్వయంగా పర్యవేక్షించినప్పటికీ, ఎన్నిక సజావుగా నిర్వహించలేక చేతులెత్తేశారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.



మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసిన పత్రాన్ని చూపుతున్న సుధారాణి

ఐదోసారైనా ఎన్నిక నిర్వహిస్తారా?

వైస్ చైర్మన్ ఎన్నిక నాలుగు పర్యాయాలు వాయిదా పడిన తరువాత రిటర్నింగ్ అధికారి రాష్ట్ర ఎన్నికల అధికారికి పంపించిన నివేదికపై ఏ నిర్ణయం తీసుకుంటారోననే చర్చ జరుగుతోంది. టీడీపీ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు దశాబ్దాల పాటు సాగించిన హవాకు దాడిశెట్టి రాజా చెక్ చెప్పారు. దీంతో గత మున్సిపల్ ఎన్నికల్లో 30కి 30 వార్డుల్లోనూ వైఎస్సార్ సీపీ గెలిచి, పురపాలక పీఠాన్ని కైవసం చేసుకుంది. అనేక రాష్ట్ర స్థాయి పదవులు చేపట్టిన రామకృష్ణుడు, ఆయన కుమార్తె దివ్య, టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే ఈ ప్రలోభాల పర్వం సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు స్థానికంగా కొంత మంది పోలీసులు ఎలాగైనా అధికారాన్ని టీడీపీకి కట్టబెట్టేందుకు కంకణం కట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఐదోసారి ఎన్నిక నిర్వహించే అంశం ప్రస్తుతం ఎన్నికల కమిషన్ వద్ద ఉంది. ఈసారైనా ఎన్నిక నిర్వహిస్తారా, లేదా అనేది చర్చనీయాంశంగా మారింది.



మున్సిపల్ కమిషనర్ వెంకట్రావుకు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న సుధారాణి



టీడీపీ నాయకులు వేధించారని మీడియాకు వివరిస్తున్న కౌన్సిలర్ వారాధి జ్యోతి



చైర్‌పర్సన్ పదవికి సుధారాణి రాజీనామా చేయడంతో కన్నీరు పెట్టుకున్న కౌన్సిలర్ చింతల సునీత

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 - 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గండేపల్లి: మండలంలోని మురారిలో పోలవరం గట్టు వద్ద గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్మకు పాల్పడ్డాడు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు వయస్సు గల మృతుని ఒంటిపై నీలం, పసుపు, నలుపు రంగు గల పొడుగు చేతుల చొక్కా, బిస్కెట్ రంగు ఫ్యాంట్, మెరూన్ రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు. పక్కనే సైకిల్ పడి ఉంది. గ్రామ వీఆర్ఏ ఫిర్యాదు మేరకు గండేపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. మృతుని ఆచూకీ తెలిస్తే సెల్: 9440796529, 9440904841 నెంబర్లకు తెలియజేయాలని ఎస్సై యువీ శివనాగబాబు తెలిపారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో 72 గంటల పాటు ఉంచనున్నట్టు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సామర్లకోట: స్థానిక రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇది. రైల్వే హెచ్‌సీ శ్రీనివాసులు కథనం ప్రకారం సామర్లకోట నుంచి విజయవాడ వైపు వెళుతున్న రైలు నుంచి 30-35 సంవత్సరాల వయసు వ్యక్తి జారి పడి అక్కడిక్కడే మృతి చెందాడు. రైల్వే మేనేజర్ ఎం.రమేష్ నుంచి వచ్చిన ఫిర్యాదుతో ఘటనా ప్రదేశానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుడి చేయి దిగువ భాగంలో ఈశ్వరీ అని తెలుగులో పచ్చబొట్టుతో రాసి ఉంది. వివరాల కోసం రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి రైల్వే ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.



పలివెలలో ఉమా కొప్పేశ్వరులకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న డీఎస్పీ మురళీమోహన్ దంపతులు



పలివెలలో ఉమా కొప్పేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఉమా కొప్పేశ్వరుల పరిణయం

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన పలివెల ఉమా కొప్పేశ్వరస్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రాల్లో కొత్తపేట మండలం పలివెల క్షేత్రం ఒకటి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ శివ పార్వతులు ఏకపీఠంపై కొలువైన విషయం తెలిసిందే. దేవదాయ - ధర్మాదాయ శాఖ జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో దేవస్థానం ఈఓ సోమాల శివ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దానిలో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఆలయంలో కల్యాణమూర్తులైన ఉమా కొప్పేశ్వరులను అర్చకులు, వేద పండితులు ప్రాంగణంలోని రాజరాజనరేంద్రుడు నిర్మించిన కల్యాణ మండపంలోకి తీసుకువచ్చారు. స్థానిక ఆర్‌డీఓ పి.శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్ సతీ సమేతంగా కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయం తరపున డీఎస్పీ మురళీమోహన్ దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. 4.45 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు ప్రతీ ఘట్టం కనుల వైకుంఠంగా జరిపించారు. అనంతరం భక్తులకు కల్యాణ తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



పంచారామ క్షేత్రంలోని స్వామివారి కల్యాణం

భీమేశ్వరునికి నేత్రపర్వంగా..



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

సామర్లకోట: బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. మహాశివరాత్రి ఉత్సవాలకు స్వాగతం పలుకుతూ స్వామి వారి కల్యాణం జరుగుతుంది. దీనిలో భాగంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. పురవీధుల గుండా గ్రామోత్సవం పూర్తి చేసుకొని రాత్రి ఆలయానికి చేరింది. ఆలయంలో గ్రామోత్సవంలో పాల్గొన్న స్వామి వారి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్యాండ్ మేళాల మధ్య ఆలయంలోని తోటలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మ వారి విగ్రహాలను ఉంచారు. ఈ మేరకు వేదికను పూలతో అలంకరించారు. అన్నవరం దేవస్థానం నుంచి వేదపండితులు పట్టు వస్త్రాలు తీసుకొని వచ్చారు. పారిశ్రామిక వేత్త గంజి బూరయ్య ముత్యాల తలంబ్రాలు ఏర్పాటు చేశారు. అన్నవరం, ఆలయ వేద పండితులు వేద మంత్రాల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. ఈ కల్యాణంను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు దంపతులు, ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అన్నవరం వేద పండితులు, ఆలయ వేద పండితుల వేద మంత్రాల మధ్య కల్యాణంలో పట్టణ పరిధిలోని పారిశ్రామిక వేత్తలు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవళాలలకు పెళ్లి కళ!

ఆ మూడు దేవాలయాల్లో సోమవారం పెళ్లి కళ తొణికిసలాడింది! కాకినాడ జిల్లా సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామభీమేశ్వర స్వామి, పిఠాపురంలోని శ్రీకుక్కుటేశ్వరస్వామి, కోనసీమ జిల్లాలోని పలివెల ఉమా కొప్పేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులే పెళ్లి పెద్దలుగా అర్చకుల వేద మంత్రోచ్చరణలు, మంగళ వాద్యాల నడుమ కల్యాణాలు వైభవోపేతంగా సాగాయి.

- కమనీయం కుక్కుటేశ్వరుని కల్యాణం
- భక్తులతో కిక్కిరిసిన పాదగయక్షేత్రం
- మారుమోగిన శివనామస్మరణ



పిఠాపురం పాదగయ క్షేత్రంలో శ్రీకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: పెళ్లంటే నూరేళ్ల పంట నిత్య కల్యాణాలతో విరాజిల్లే ఆది దేవుడి వార్షిక కల్యాణం అంటే భక్తులకు కనుల పండువ. ఆది దేవుని కల్యాణానికి ముత్తయిదువలు పసుపు వాయ వేయగా భక్తులంతా పెళ్లి పెద్దలుగా తరలిరాగా ఆధ్యాత్మిక కేంద్రమైన పిఠాపురం పెళ్లి కళతో కళకళలాడింది. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా స్వామి అమ్మవార్లను తీసుకుని సారె చీరలతో వేద మంత్రాల మధ్య మంగళ వాయిద్యాలతో భక్త జనం తరలివచ్చారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో వార్షిక కల్యాణోత్సవాలు, మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీకుక్కుటేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్త జనసందోహం నడుమ శ్రీకుక్కుటేశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవార్ల పరిణయం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తుల ఆధ్వర్యంలో పసుపు కొట్టి స్వామి అమ్మ వార్లను పెళ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేశారు. అనంతరం స్థానిక శ్రీరామకృష్ణ వాసవి కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపం వద్ద ఎదురు సన్నాహం నిర్వహించారు. గజవాహనంపై గ్రామోత్సవం అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పెండ్లికుమారుడైన కుక్కుటేశ్వరస్వామిని, పెండ్లి కుమార్తెగా రాజరాజేశ్వరి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, నగలతో అర్చకులు అలంకరించారు. స్వామివారిని, అమ్మవారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొని వచ్చి రంగు రంగుల విద్యుత్ దీపాలు, పువ్వులతో సుందరంగా అలంకరించిన కల్యాణ వేదికపై అధిష్టింపచేశారు. వేద పండితులు ద్విబాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాటి ఆధ్వర్యంలో అర్చకులు చెరుకుపల్లి వెంకటేశ్వశర్మ, అల్లంరాజు చంద్రమౌళి, వింజమూరి సుబ్రహ్మణ్యం యాజ్ఞీకంలో వేదమంత్రాల నడుమ విష్వక్సేన పూజతో కల్యాణాన్ని ప్రారంభించారు. రాత్రి 8.32 గంటలకు స్వామివారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. వివాహ సమయంలో పుణ్యాహవచనం, కంకణ ధారణ, సుముహూర్తం, కన్యాదానం, యజ్ఞోపవీతధారణ, మంగళ సూత్రధారణ, తలంబ్రాలు, ఆశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తుల శివనామ స్మరణల మధ్య కుక్కుటేశ్వర స్వామి కల్యాణోత్సవం రమణీయంగా నిర్వహించారు. ఈవో జగన్మోహన్ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



శ్రీకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

వీఐపీలకు ఒంటి గంట నుంచి 2.30 వరకు దర్శనం

కలెక్టర్ షణ్మోహన్

సామర్లకోట/పిఠాపురం: స్థానిక పంచారామ క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారిని మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల మధ్య దర్శనం చేసుకోవలసి ఉంటుందని కలెక్టర్ షణ్మోహన్ సగిలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అధికారుల సమీక్ష సందర్భంగా వీఐపీలు దర్శనానికి వచ్చిన సమయంలో సాధారణ భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారనే ఫిర్యాదుల మేరకు ఆయన ఈ ప్రకటన చేశారు. వీఐపీలు వచ్చిన సమయంలో వారికి దర్శనం చేయించడానికి ఇద్దరు లైజన్ అధికారులు మనోజ్‌కుమార్, బీవీ మోహన్‌రావులను నియమించినట్టు తెలిపారు. పంచారామ క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ మేరకు భక్తుల సహాలు, సూచనలు తీసుకొన్నామన్నారు. ఉచిత దర్శనంతోపాటు, రూ.20, రూ.50, రూ.100 క్యూ లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మహాశివరాత్రి రోజున భక్తులు ఆలయ కోనేరులో పుణ్యస్నానాలు చేసే అవకాశం ఉన్న కారణంగా ప్రమాదాలు జరుగకుండా గజ ఈతగాళ్లను నియమించామన్నారు. 27న రథోత్సవానికి భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

పిఠాపురంలో ఇలా..

ఈ నెల 26 న జరిగే మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం దర్శనం నిమిత్తం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. వీఐపీలు 26 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దర్శనం చేసుకోవచ్చని పేర్కొన్నారు. వీఐపీలకు ఇద్దరు లైజన్ అధికారులను నియమించామని తెలిపారు. బి వీర భద్రరావు సెల్ నెంబర్ 9963575998, జోగా సత్యనారాయణ సెల్ నెంబర్ 9948024322 లను సంప్రదించి వీఐపీ దర్శనం చేసుకోవచ్చని సూచించారు. పుష్కరిణి పారిశుధ్య పనుల కోసం అదనంగా వంద మంది పారిశుధ్య సిబ్బందిని నియమించామన్నారు. భక్తుల రక్షణ కోసం చిన్న బోటును, కోనేటి చుట్టూ 24 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. మహా శివ రాత్రికి వాహనాలపై వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయానికి నలువైపులా కేవలం 500 మీటర్లు దూరంలోనే ఆరు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు.

వెటరన్ టీటీ పోటీలలో మోహన్‌బాబుకు కాంస్యం



ఏపీ నుంచి తొలిసారి కాంస్య పతకం సాధించిన మోహన్‌బాబు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఈ నెల 17 నుంచి 23 వరకు జరిగిన 31వ జాతీయస్థాయి వెటరన్ టేబుల్ టెన్నిస్ పోటీలలో ఏపీ జట్టు ప్రతిభను కనబరచి రాష్ట్ర చరిత్రలో తొలిసారి కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఈ పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు కాకినాడ జిల్లాకు చెందిన రిటైర్డ్ ఆయుష్ వైద్యాధికారి కోటగిరి మోహన్ బాబు కెప్టెన్‌గా వ్యవహించారు. నాకౌట్ పోటీలలో కర్ణాటక, గుజరాత్ బి, చండీఘర్ జట్లపై గెలుపొంది సెమీఫైనల్స్‌లో గుజరాత్ ఏ పై 3-2 స్కోర్‌తో ఏపీ జట్టు ఓటమి చెంది తృతీయస్థానంలో నిలిచింది. 1975 నుంచి టీటీ ఆడుతున్న మోహన్‌బాబు 1978లో కాలికట్ నేషనల్స్, 1982, 84లో ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం కాకినాడ డీఎస్ఏ టీటీ హాల్‌లో క్రీడాకారులకు తర్ఫీదునిస్తున్నారు. జాతీయస్థాయిలో పతకం సాధించిన మోహన్‌బాబును జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, జిల్లా టీటీ సంఘ గౌరవ అధ్యక్షుడు రావు చిన్నారావు, అధ్యక్షుడు విజయప్రకాష్, ఉపాధ్యక్షుడు దంటు భాస్కర్, టీటీ క్రీడాకారుడు సింగరాజు సోమవారం అభినందించారు.

ఆటో నుంచి జారిపడి బాలుడి మృతి

ఆదిమూలంవారిపాలెంలో పెళ్లి ఇంట విషాదం



మృతిచెందిన పవన్ శ్రీనివాస్ (ఫైల్)

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టుపై సోమవారం సాయంత్రం శివకోడు నుంచి ఆదిమూలంవారి పాలెం వెళుతున్న గూడ్స్ ఆటో గుంతలో పడి డోర్ ఓపెన్ కావడంతో దాని నుంచి జారి కిందపడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. ఆదిమూలం వారిపాలెంలో మార్చి 1న బాలుడి చిన్నాన్న వివాహం జరగాల్సి ఉంది. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందడంతో పెళ్లి ఇంట విషాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊడిమూడి శివారు ఆదిమూలం వారిపాలెంనకు చెందిన చిలకలపూడి శివనాగేంద్ర, అతని తమ్ముడు దైవప్రసాద్ హైదరాబాద్‌లో కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. తమ్ముడు దైవప్రసాద్‌కు వచ్చేనెల 1న వివాహం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నాగేంద్ర భార్య స్వర్ణ, వారి చిన్న కుమారుడు పవన్ శ్రీనివాస్ (4)లు ఇటీవల హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన ఆదిమూలంవారిపాలెంనకు వచ్చారు. ఒక పక్క పెళ్లి ఏర్పాటు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నాగేంద్ర కుటుంబ సభ్యుడు ఒకరు శివకోడు గ్రామంలోని సోదరి ఇంటికి ఆటోలో బయల్దేరాడు. అతనితో పాటు బాలుడు పవన్ శ్రీనివాస్ కూడా మేనత్త ఇంటికి వెళ్లాడు. సాయంత్రం అక్కడి నుంచి తిరిగి వస్తుండగా స్థానిక అక్విడెక్టుపై కుదుపులకు సడన్‌గా ఆటో డోర్ ఓపెన్ అయ్యింది. దీంతో డ్రైవర్ పక్కన కూర్చొన్న బాలుడు అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. బాలుడిని హుటాహుటిన అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో నాలుగు రోజుల్లో పెళ్లి జరగాల్సిన ఇంట్లో పెను విషాదం చోటు చేసుకుంది. అల్లారు ముద్దుగా పెరిగిన పవన్ శ్రీనివాస్‌ను మృత్యువు కాటేయడంతో కుటుంబ సభ్యులు దుఃఖ సాగరంలో మునిగి పోయారు. బాలుడి తండ్రి నాగేంద్ర హైదరాబాద్ నుంచి బయల్దేరాడు.

అక్రమంగా పశువులను తరలిస్తున్న లారీ పట్టివేత

కిర్లంపూడి: అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న గూడ్స్ లారీని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న గూడ్స్ లారీని తనిఖీ చేయగా దానిలో 72 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. కొత్తవలస, విజయనగరం ప్రాంతాల నుంచి కేరళ రాష్ట్రానికి ఎద్దులను తరలిస్తున్నట్టు విచారణలో తేలింది. దీంతో లారీని సీజ్ చేసి, కేరళకు చెందిన డ్రైవర్ విష్ణుతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఎద్దులను గోకవరం మండలం కృష్ణునిపాలెంలోని గోశాలకు అప్పగించామన్నారు.

దొంగ కోడలి పట్టివేత

- అత్త సొత్తు కోసం కుతంత్రం
- దాడి చేసి బంగారం, సొమ్ము చోరీ
- సాంకేతికత సాయంతో ఆమె అనుచరులు కూడా అరెస్ట్



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ దేవరాజ్ మనీష్, సీఐ నాగదుర్గారావు

కాకినాడ క్రైం: అత్త సొత్తు కోసం ఓ కోడలు దొంగగా మారింది. మావయ్య చనిపోతే మొసలు కన్నీళ్లు కారుస్తూ పరామర్శ పేరుతో అత్తగారింట్లో రెక్కీ చేసింది. ఎవరికీ అనుమానం రాకుండా అక్కడి నుంచి స్వస్థలానికి వెళ్లిపోయి, మళ్లీ తిరిగి వచ్చి ముసుగు దొంగ అవతారంలో ప్రత్యక్షమైంది. అయితేనేం, సీసీ టీవీ ఫుటేజీ, సాంకేతికత పట్టుబడేలా చేశాయి. అత్తారింటిని నిండా ముంచిన కోడలి చోర ప్రావీణ్యాన్ని కాకినాడ సబ్ డివిజన్ ఏఎస్పీ దేవ రాజ్ మనీష్ సోమవారం నగరంలోని స్థానిక వన్‌టౌన్ పీఎస్‌లో విలేకరులకు వెల్లడించారు.

కాకినాడ జగన్నాథపురం యానాం రోడ్ సమీపంలో ఉండే 74 ఏళ్ల చాగంటి శుక్రవారపు మహాలక్ష్మి భర్త శ్రీరామచంద్రమూర్తి వయో భారంతో కొద్దిరోజుల క్రితం మృతి చెందారు. ఈయన విశ్రాంత ఏపీఎస్పీ అడ్మినిస్ట్రేటర్. ఈ దంపతులకు పిల్లలు లేకపోవడంతో శంకర్ అనే వ్యక్తిని చిన్నప్పుడే దత్తత తీసుకొన్నారు. ఈయన సిర్పూర్-కాగజ్‌నగర్‌లో ఓ సంస్థలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈయన కొద్ది నెలల క్రితం తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా, మేడిపల్లి మండలం, కట్లకుంట గ్రామానికి చెందిన ధారా రజిత అనే యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడు. భార్యతో కలిసి హైదరాబాద్‌లో కాపురం ఉంటున్నాడు. కొద్ది వారాల క్రితం శంకర్ దత్త తండ్రి శ్రీరామచంద్రమూర్తి మృతి చెందారు. మావయ్య చనిపోవడంతో కోడలు అత్తయ్యని పరామర్శించేందుకు వచ్చింది. నెల రోజులకు పైగా అత్తగారింట్లోనే గడిపింది. అనంతరం అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లిపోయింది. అలా వెళ్లిపోయిన రజితకు అత్తగారింట్లో చూసిన బంగారం, డబ్బుపై దుర్బుద్ధి పుట్టింది. ఎలా అయినా కాజేయాలని కుట్ర పన్నింది. ఈ క్రమంలో తమ బంధువులైన ధారా రఘు(కట్లకుంట గ్రామం), తొందిర్తి లత(రాయలపల్లి గ్రామం, గంగాధర మండలం, కరీంనగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం), తాటి వెంకటేష్(ఇస్లాంపూర్ గ్రామం, గంగాధర మండలం, కరీంనగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం) లతో కలిసి పథక రచన చేసింది. ఈ నెల 14వ తేదీన కాకినాడ వచ్చి అనుకున్నది అనుకున్నట్టు అమలు చేశారు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న వృద్ధురాలిని విచక్షణారహితంగా కొట్టారు. నోట్లో గుడ్డలు కుక్కి చేతులు, కాళ్లు కట్టేశారు. చేతి గాజులు, మెడలో ఉన్న బంగారాన్ని లాక్కున్నారు. ట్రంకు పెట్టెలో ఉన్న రూ.60 వేల నగదును ఎత్తుకెళ్లారు. పరామర్శ సమయంలో తాను చూసిన బంగారం అక్కడ లేకపోవడంతో, మీ ఇంట్లో ఎక్కువ బంగారమే ఉండాలి అదంతా ఏమైందో చెప్పాలని పెద్దామెను చిత్రహింసలకు గురి చేశారు. ఫలితం లేకపోయే సరికి అందిన కాడికి దోచుకొని పరారయ్యారు. ఆ వెంటనే మహాలక్ష్మి కాకినాడ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. సీఐ నాగదుర్గారావు, సీసీఎస్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో బృందాలు దొంగలను వెతికే పనిలో పడ్డాయి. సీసీ టీవీ ఫుటేజీలు, సెల్‌ఫోన్ సిగ్నల్ల ఆధారంగా మహాలక్ష్మి కోడలు రజిత దొంగతనానికి ఒడిగట్టిందని వెల్లడైంది. బాధితురాలు మహాలక్ష్మి ఇంట్లో పనిచేస్తున్న పనిమనిషి రామలక్ష్మి ఎప్పటికప్పుడు వీరికి సాయం అందించేదని పోలీసుల విచారణలో తేలింది. దీంతో రజిత సహా ధారా రఘు, తొందిర్తి లత, తాటి వెంకటేష్, రామలక్ష్మిలను పోలీసులు అరెస్టు చేశారు. వారు అన్నమ్మఘాటి సెంటర్‌లో పట్టుబడినట్లు సబ్ డివిజన్ ఏఎస్పీ వెల్లడించారు. వారి నుంచి రూ.2.3 లక్షల నగదు, 9.5 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారి ఇంటి నుంచి వీటిలో రూ.60 వేల నగదు, 9.5 గ్రాముల బంగారాన్ని కోడలు ఆమె బృందం ఎత్తుకెళ్లారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ క్రాంతి, వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు బృందాన్ని ఏఎస్పీ అభినందించారు.

బాలయోగి ప్రీమియర్ లీగ్ విజేత రాధా లెవన్



విజేత రాధా లెవన్ జట్టుతో సీఐ ప్రశాంతకుమార్ తదితరులు

అమలాపురం రూరల్: జీఎంసీ బాలయోగి ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను రాధా లెవన్ జట్టు కైవసం చేసుకుంది. ఫిబ్రవరి 16న బాలయోగి స్టేడియంలో ఈ పోటీలు పారంభించామని నిర్వాహకులు రాజీవ్, చిన్ను, బాబీ, నాయుడు తెలిపారు. ఈ పోటీల్లో 32 జట్లు తలపడ్డాయి. సోమవారం జరిగిన ఫైనల్‌లో రాధా లెవెన్, జట్టు చందు లెవెన్ మధ్య జరిగిన హోరాహోరీ పోరులో రాధా లెవన్ విజయం సాధించింది. రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ ,కోనసీమ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారెం రవితేజ, స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ సురేష్ చేతుల మీదుగా విన్నర్‌కు రూ.30,000 వేలు నగదు బహుమతి, రన్నర్ జట్టుకు రూ.15,000 వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగోలు వీర రాజ్, కిషోర్, పేరాబత్తుల ఫణి, యాళ్ల రవి, లింగోలు కృష్ణ, పెయ్యల సాయి, చిత్రపు అజయ్, మేడేపల్లి రాజు, కొప్పల ప్రశాంత్, అరిగెల వెంకటేశ్వరరావు, డేవిడ్ అంబేడ్కర్, చిత్రపు జయరాజ్, జిల్లెళ్ళ రమేష్, శ్రావణ్, కుమ్మరి పాల్గొన్నారు.